క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పార్వతీపురం టౌన్: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ వీవీ కిశోర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నర్సిపురం, తాళ్లబురిడి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా నర్సిపురం, సంగంవలస, హెచ్.కారాడవలస, వెంకంపేట, ఎమ్మార్‌నగరం, పుట్టూరు, రావికొన, చినబొండపల్లి, పెదమరికి, చినమరికి, డీకేపట్నం, తాళ్లబురిడి, గోచక్క, డోకిశీల, లచ్చిరాజుపేట, బందలుప్పి, పెదబొండపల్లి, జమదాల, లక్ష్మీనారాయణపురం, పట్టణంలోని వైకేఎం కాలనీలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

జ్యూట్ మిల్లును తెరిపించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

సాలూరు: మండలంలోని జీగిరాం జ్యూట్ మిల్లును ప్రభుత్వం తక్షణమే తెరిపించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. యాజమాన్యం అక్రమ లాకౌట్ ప్రకటించడంతో కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని వాపోయారు. స్త్రీ, శిశుసంక్షేమశాఖ, గిరిజన సంక్షేమ శాఖామంత్రి సంధ్యారాణి, జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓలు స్పందించి జ్యూట్ మిల్లు యాజమాన్యంతో మాట్లాడి మిల్లును తెరిపించాలని, కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎన్.వై. నాయుడు, ఈశ్వరరావు, ప్రసాద్, రాము, సీతారాం, తదితరులు పాల్గొన్నారు.

చలో కలెక్టరేట్ రేపు



గోడపత్రికలను విడుదల చేస్తున్న రామస్వామి

పార్వతీపురంటౌన్: ఈ నెల 29న నిర్వహించే చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘ నాయకుడు రామస్వామి పిలుపునిచ్చారు. మండలంలోని రావికోన గ్రామంలో శనివారం 'చలో కలెక్టరేట్' గోడపత్రికలను విడుదల చేశారు. శివం బాధితులకు న్యాయం జరిగేలా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని, దళితులపై దాడి చేసిన పెత్తందారులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.

గోముఖి నదిలోకి నీరు విడుదల

మక్కువ: వెంగళరాయసాగర్ ప్రాజెక్ట్ పరిధిలోని గోముఖీ రెగ్యులేటర్ నుంచి గోముఖీ నదిలోకి శనివారం నీరు విడిచిపెట్టినట్లు వీఆర్ఎస్ జేఈ ప్రశాంత్ శనివారం తెలిపారు. ఒడిశా రాష్ట్రం నుంచి వీఆర్ఎస్ ప్రాజెక్ట్‌కు ఇన్‌ఫ్లో పోటెత్తడంతో దిగువకు 600 క్యూసెక్కులు విడిచిపెడుతున్నట్లు చెప్పారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, ఉపాధ్యాయులు

మక్కువ: మొక్కలను సంరక్షించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకుందామని సీఆర్‌పీఎఫ్ డి-198 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ డి.కృష్ణారావు పిలుపునిచ్చారు. సీఆర్‌పీఎఫ్ దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో సీఆర్‌పీఎఫ్ బలగాలు శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో సీఆర్‌పీఎఫ్ బలగాలు, పాఠశాల ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. వివిధ రకాల వెపన్లను ప్రదర్శించి, వాటి ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమాండెంట్ కృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థులు సైన్యంలో చేరి దేశానికి సేవ చేసేందుకు ముందుకురావాలని పిలుపునిచ్చారు. క్రమశిక్షణతో చదువుకొని, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై పి.నరసింహమూర్తి, సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్‌కుమార్ ఛత్రి, హెచ్‌ఎం హేమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశం

పార్వతీపురంటౌన్: మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశాన్ని చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్వతీపురం పట్టణ అభివృద్ధిపై అజెండాను సభలో ప్రవేశ పెట్టగా.. కౌన్సిల్ సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులపై సమీక్షించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి



బలిజిపేట: మొక్కలు నాటుతున్న ఎంఈఓ-1, ఉపాధ్యాయులు



మొక్కలు నాటుతున్న డీఈఓ పగడాలమ్మ

పార్వతీపురంటౌన్: పెదబొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం చుక్క ప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. డీఈఓ గార పగడాలమ్మ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ఔషధ మొక్కలు, వివిధ రకాల పండ్ల మొక్కలు నాటారు. వాటిని సంరక్షణ బాధ్యతను ఎకో క్లబ్ కన్వీనర్ రవికిశోర్, క్లబ్ సభ్యులకు అప్పగించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బలిజిపేట: 'శిక్షా సప్తాహ్' కార్యక్రమంలో భాగంగా శనివారం పాఠశాలల్లో అమ్మవనం కార్యక్రమం నిర్వహించారు. బలిజిపేట ఉన్నత పాఠశాల వద్ద ఎంఈఓ-1 సామల సింహాచలం ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. మొక్కల సంరక్షణకు అన్ని పాఠశాలలో ఎకో క్లబ్‌లు ఏర్పాటుచేసినట్లు చెప్పారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని సూచించారు. విద్యార్థుల తల్లులను కార్యక్రమంలో భాగస్వాములను చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా రంగునాయుడు పుట్టినరోజు



రంగునాయుడికి కేక్ తినిపిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర

మక్కువ: వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు 56వ పుట్టినరోజు వేడుకలను వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు శనివారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర పాల్గొని రంగునాయుడికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్థానిక వెంకటరామ కళ్యాణ మండపంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని సందర్శించారు. అలాగే వస్త్రదాన కమిటీ ఆధ్వర్యంలో సుమారు 1000 మంది వృద్ధులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. మక్కువ, పాచిపెంట, సాలూరు మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు పద్మశ్రీ థియేటర్ వద్దకు చేరుకొని రంగునాయుడుకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా 5వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకానికి చర్యలు

పార్వతీపురంటౌన్: ఉపాధిహామీ పథకంలో క్షేత్ర సహాయకుల ఖాళీలను భర్తీ చేసేందుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు. ఖాళీల భర్తీ ప్రక్రియను ఈనెల 31లోపు పూర్తిచేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందడంతో ఆ మేరకు సత్వర చర్యలు చేపడుతున్నారు. జిల్లాలోని 15 మండలాల్లో 34 ఖాళీలు ఉన్నట్లు గుర్తించారు. వాటిని నిబంధనల మేరకు భర్తీ చేయాలని ఏపీఓలకు డ్వామాపీడీ రామచంద్రరావు ఆదేశించారు. శనివారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. బుధవారం నాటికి పూర్తిస్థాయిలో నియామక ప్రతిపాదనలు డ్వామా కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

అబ్దుల్ కలాంకు నివాళి



కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న యువకులు

బలిజిపేట: మండలంలోని పెదపెంకి గ్రామంలోని నేతాజీ గ్రంథాలయంలో మాజీ రాష్ట్రపతి, ప్రఖ్యాత శాస్త్రవేత్త, భారతరత్న గ్రహీత డాక్టర్ అబ్దుల్ కలాం వర్ధంతిని శనివారం నిర్వహించారు. గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవనాయుడు, గ్రామస్తులు కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశానికి కలాం అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. కలాం జీవితం, ఆయన ఉపదేశాల నుంచి యువత స్ఫూర్తి పొందాలని సూచించారు. కార్యక్రమంలో వి.శివుడునాయుడు, పి.బలరాంనాయుడు, కె.గౌరీనాథ్, జి.శ్రావణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు బదిలీ

సీతానగరం: మండల తహసీల్దార్ శ్రీనివాసరావుకు విశాఖ జిల్లాకు బదిలీ అయింది. సార్వత్రిక ఎన్నికల సమయంలో విశాఖపట్నం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఎన్నికలు పూర్తి కావడంతో తిరిగి సొంత జిల్లాలకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది.

నేడు కళాకారుల సమావేశం

గరుగుబిల్లి: తోటపల్లి జట్టు నూతన ట్రస్ట్ కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర కళాకారుల సంక్షేమ సంఘ కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ అధ్యక్షుడు ద్వారపురెడ్డి ధనుంజయరావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభు త్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాకారులంతా సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

చురుగ్గా శానిటేషన్ పనులు

గరుగుబిల్లి: మండలంలోని పెద్దూరు గ్రామంలో పారిశుద్ధ్య పనులు చురుగ్గా చేపడుతున్నట్లు ఉప సర్పంచ్ తెర్లి ఎల్లంనాయుడు తెలిపారు. గ్రామంలోని కాలువల్లో పేరుకుపోయిన పూడికలు తొలగించి బ్లీచింగ్ వేయించారు. అలాగే తాగునీటి బోర్లు, రక్షిత పథకాల పరిసరాలను శుభ్రం చేయించి క్లోరినేషన్ చేపట్టారు. గ్రామంలోని పలు వీధుల్లో మరమ్మతులకు గురైన విద్యుత్ వీధిదీపాల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేశారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం



పాచిపెంట: ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది, విద్యార్థులు



బలిజిపేటలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

పాచిపెంట: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని సీడీపీఓ అనంతలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో శనివారం నిర్వహించిన 'బేటీ బచావో బేటీ పడావో' కార్యక్రమంలో ఆమె పాల్గొని బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. బాలికల విద్య, ఆరోగ్య సంరక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారం, బాలికల రక్షణకు ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలపై అవగాహన కల్పించారు. బాలికలు ఉన్నత విద్య అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. అనంతరం విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించి, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బలిజిపేట: మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం 'భేటీ బచావో- భేటీ పడావో' ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కిశోర బాలికల పోషణ, ఆరోగ్యం, విద్య, సంరక్షణ, గుడ్ టచ్- బ్యాడ్ టచ్, తదితర అంశాలపై జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఎంఎన్ రాణి అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. బాలికలను ఉన్నత చదువులు చదివించాలని, బాలికలపై లైంగిక వేధింపులకు అడ్డుకట్ట వేయాలని కోరారు. అంగన్‌వాడీల ద్వారా మహిళలకు అందుతున్న సేవలను వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సీడీపీఓ సులేఖ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మావతి, కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జియో నెట్‌వర్క్ సమస్య పరిష్కరించాలి



ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

పార్వతీపురంటౌన్: పట్టణంలో పదిరోజులుగా జియో నెట్‌వర్క్ సేవలు నిలిచిపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీఐటీయూ జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ అన్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో ఇన్‌చార్జ్ ఏఓ కె.చంద్రమోహన్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. జియో నెట్‌వర్క్ సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపాలని కోరారు. ఆయన వెంటనే స్పందించి జియో సంస్థ సిబ్బందితో ఫోన్‌లో మాట్లాడారు. ఏయే ప్రాంతాల్లో సిగ్నల్ సమస్య ఉందో ఆయనకు వివరించారు. వెంటనే సమస్య పరిష్కరిస్తామని జియో సంస్థ సిబ్బంది హామీ ఇచ్చినట్లు చెప్పారు.

న్యాయ సహకారాన్ని సద్వినియోగం చేసుకోండి

పాలకొండ రూరల్ : సొంతంగా న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేని రిమాండ్ ఖైదీలు ప్రభుత్వం అందించే న్యాయ సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎ.విజయ్‌రాజ్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక సబ్‌జైల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఖైదీలకు న్యాయ శాస్త్రం ద్వారా అందించదగిన అంశాలపై అవగాహన కల్పించారు. క్షణికావేశాలు, ఇతర కారణాలతో కేసుల్లో చిక్కుకుని రిమాండ్‌కు వచ్చిన వారు కృంగిపోకుండా, నేరపూరిత భావన విడనాడి మంచిగా జీవనం సాగించాలని ఆకాంక్షించారు. అనంతరం ఖైదీలకు అందుతున్న వసతులపై జైల్ సూపరింటెండెంట్ బి.జోగులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు మరిచర్ల జగన్‌మోహనరావు, న్యాయస్థానం సిబ్బంది ఉన్నారు.

అనధికార సభ్యుల హడావిడే ఎక్కువ...

- మండల సర్వసభ్య సమావేశంలో పలు అంశాలపై చర్చ



మండల సమావేశంలో పాల్గొన్న అధికారులు, సభ్యులు

భామిని: ఎంపీపీ తోట శాంతికుమారి అధ్యక్షతన, ఎంపీడీఓ కొవ్వాడ కిశోర్‌కుమార్ పర్యవేక్షణలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో అనధికార సభ్యుల హడావిడే ఎక్కువగా కనిపించింది. సభ్యులకు బదులు వారి ప్రతినిధులు ఎక్కువగా హాజరై మండల పరిషత్ నిధుల వినియోగంపై రాద్ధాంతం చేశారు. మణిగ, బొడ్డగూడ, భామిని గ్రామాల సమస్యలకు నిధులు కేటాయించలేదని ప్రశ్నించారు. దీంతో కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన తోట సింహాచలం, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు మజ్జి మోహన్‌బాబు కలుగజేసుకుని అవసరాల మేరకు అన్ని గ్రామాలకూ నిధులు కేటాయించామని తెలియజేయడంతో సభ్యులు శాంతించారు. రైతులకు ఎరువుల కొరత రాకుండా చూడాలని చిన్నిదిమిలి, సతివాడ సర్పంచ్‌లు రవికుమార్, రామారావు కోరారు. ఉపాధి పథకం ద్వారా మండలానికి 24 గోశాలలు మంజూరయ్యాయని ఏపీఓ తులసీదాస్ తెలిపారు. అనంతరం వీధిలైట్లు, విద్యుత్ లైన్ల నిర్వహణ, గృహనిర్మాణాలకు సంబంధించిన బిల్లుల మంజూరుపై చర్చించారు. కార్యక్రమంలో ఏఓ సింహాచలం, ఏఈ చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ బి.ధర్మారావు, ఎంపీటీసీ సభ్యులు కె.చంద్రశేఖర్, పి.ఉషారాణి, పాలక మురళీ, పి.రాంబాబు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు, గ్లాసుల పంపిణీ

సీతానగరం: భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా పార్వతీపురం టౌన్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తి సేవా కార్యక్రమం నిర్వహించారు. ఇప్పలవలస గ్రామంలో వృద్ధులకు శనివారం దుప్పట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ యు.సూర్యనారాయణ, జేఎస్పీ ఐటీ కోఆర్డినేటర్ పి.సత్యనారాయణ మాట్లాడుతూ.. భారతరత్న అవార్డు గ్రహీత, శాస్త్రవేత్త డాక్టర్ అబ్దుల్ కలాం వర్ధంతిని పురస్కరించుకుని కృష్ణమూర్తి ఏటా ఇటువంటి సేవకార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కృష్ణమూర్తి సేవలను స్ఫూర్తిగాతీసుకుని మరికొంత మందిదాతలు సమాజ సేవకు ముందుకురావాలని పిలుపునిచ్చారు. కృష్ణమూర్తి మాట్లాడుతూ.. దేశానికి సేవలందించిన డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని తన జీతం నుంచి ప్రతినెలా కొంత మొత్తాన్ని సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు శ్రీరాములు, రేగునాయుడు, ప్రకాష్ పాల్గొన్నారు.



పేదలకు దుప్పట్లు, గ్లాసులు పంపిణీ చేస్తున్న హెచ్‌సీ కృష్ణమూర్తి

ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలి

- అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు



మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి దామోదరరావు

పార్వతీపురంటౌన్: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని రెండవ అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ ఎస్.దామోదరరావు అన్నారు. స్థానిక జిల్లా ఆస్పత్రిని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. ఆయన వెంట బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎన్.శ్రీనివాసరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. వి.వాగ్దేవి, మెడికల్ అధికారి డాక్టర్ శ్యామల, సివిల్ సర్జన్ రవికుమార్, పలువురు వైద్యులు, న్యాయవాదులు ఉన్నారు.

బాలలతో భిక్షాటన చేయిస్తే కఠిన చర్యలు

- జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ



స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్న బాలల సంరక్షణ అధికారి సత్యనారాయణ

పార్వతీపురంటౌన్: భిక్షాటన చేస్తున్న బాలలను గుర్తించేందుకు జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారిత అధికారి సారథ్యంలో శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ మాట్లాడుతూ.. ఈ డ్రైవ్‌లో భిక్షాటన చేస్తున్న పది మంది చిన్నారులను గుర్తించి వారితో పాటు వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేసినట్లు చెప్పారు. మరోసారి భిక్షాటన చేస్తూ కనిపిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాలలతో భిక్షాటన చేయిస్తున్న వారిపై చట్టప్రకారం లక్ష రూపాయలు జరిమానా, ఐదు సంవత్సరాల జైలు శిక్ష ఉంటుందని స్పష్టం చేశారు. పిల్లలను ఎండలో పెట్టి భిక్షాటన చేయించడం వల్ల వారి ఆరోగ్యం క్షీణిస్తుందన్నారు. పిల్లలను పోషించే స్తోమత లేనివారు వారిని ప్రభుత్వానికి అప్పగిస్తే.. ఆ పిల్లలను నిబంధనల ప్రకారం దత్తత ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బాలల సంరక్షణ అధికారులు ఎం.ప్రసాదరావు, అరసవిల్లి నాయుడు, లీగల్ ఆఫీసర్ పి.శ్రీధర్, కౌన్సిలర్ జి.తవిటినాయుడు, సోషల్ వర్కర్ దేవి, హరికృష్ణ, అనీల్, రమణమ్మ, రమ్య తదితరులు పాల్గొన్నారు.

కాలిబాటలతో బహుళ ప్రయోజనాలు



ఎంటపొలంలో కాలిబాటలు తీయిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

బలిజిపేట: వరి నాట్లు పూర్తయిన పొలాల్లో కాలిబాటలు ఏర్పాటు చేయడం వల్ల బహుళ ప్రయోజనాలు ఉంటాయని మండల వ్యవసాయాధికారి శ్రావణ్‌కుమార్‌నాయుడు సూచించారు. మండలంలోని బర్లి గ్రామంలోని పి.అప్పలనాయుడు, బి.భాస్కరరావుకు చెందిన వరిపొలాన్ని శనివారం పరిశీలించారు. కాలిబాటలు తీయడం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. నాట్లు వేసిన 10 నుంచి 15 రోజుల్లో కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రతీ రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల వెడల్పులో కాలిబాటలు తీసుకోవాలన్నారు. దీని వల్ల మొక్క మొదళ్లకు పూర్తిస్థాయిలో గాలి, వెలుతురు అందుతుందని, ఫలితంగా దుబ్బులు ఎక్కువగా ఏర్పడి దిగుబడి పెరుగుతుందని, సుడిదోమ ఉధృతి తగ్గుతుందని అన్నారు. అలాగే ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేసుకునేందుకు కాలిబాటలు అనుకూలంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఏఈఓ చాందినీ, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మేకలు, గొర్రెలకు టీకాలు



మాట్లాడుతున్న మండల పశువైద్యాధికారి రామారావు

సీతానగరం: మండలంలోని గొర్రెలు, మేకలకు సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తుగా టీకాలు వేస్తున్నామని పశువైద్యాధికారి ఎస్.రామారావు అన్నారు. నిడగల్లు పశువైద్య కేంద్రంలో గ్రామీణ పశువైదయ కేంద్రాల వైద్యులు, సిబ్బంది, పశుసంవర్థక సహాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. పశువులకు సీజనల్‌గా వచ్చే వ్యాధులపై పాడిరైతులకు అవగాహన కల్పించాలన్నారు. వ్యాధుల బారిన పడిన పశువులకు సకాలంలో వైద్యం అందించాలని సూచించారు. ఇప్పటికే 6,500 గొర్రెలు, మేకలకు నల్లనాలుక వ్యాధి నివారణ టీకాలు వేశామని, 24,300 గొర్రెలు, మేకలకు పీపీఆర్ వ్యాధి నివారణ మందులు వేశామని తెలిపారు. పశుగ్రాసం సాగును ప్రోత్సహించేందుకు గాను పాడిరైతులకు 75 శాతం రాయితీపై పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేస్తున్నామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకునేలా పశువైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బూర్జ, కె.ఎస్.పురం, గుచ్చిమి పశువైద్యాధికారులు పాల్గొన్నారు.

యువతలో నైపుణ్యాలు పెంపొందించాలి



ఎస్పీకి మొక్కను అందజేస్తున్న ఐఆర్‌పీడబ్ల్యూఏ డైరెక్టర్ ప్రకాష్

పార్వతీపురంటౌన్: స్వామి వివేకానంద స్ఫూర్తితో యువత సన్మార్గంలో నడవాలని ఎస్పీ ఎస్వీ మాధవ్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో శనివారం ఐఆర్‌పీడబ్ల్యూఏ డైరెక్టర్ ప్రకాష్ ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నేటి యువతకు వారి నైపుణాలకు తగ్గట్టు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని నైపుణ్య శిక్షణ సంస్థలు, నెహ్రూ యువ కేంద్రం, జిల్లా యువజన సర్వీసులు శాఖ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు సూచించారు. కార్యక్రమంలో ఐఆర్‌పీడబ్ల్యూఏ సిబ్బంది గణేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

కురుపాం: వచ్చే నెల 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని మాజీ ఎంపీపీ హిమరిక నిలకంఠేశ్వరరావు, వైస్ ఎంపీపీలు బిడ్డిక అన్నాజీరావు, రంగారావు, ఎంపీటీసీ విధ్యారాణి, పలువురు సర్పంచ్‌లు పిలుపునిచ్చారు. శనివారం వారు మాట్లాడుతూ మండలంలోని నీలకంఠాపురం పంచాయతీలో ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని గిరిజన సాంప్రదాయాలు, ఆచారాలు, కట్టుబాట్ల ప్రకారం నిర్వహించేందుకు నిర్ణయించామన్నారు.

ఈ వేడుకల్లో గిరిజనులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీటీసీలు బిడ్డిక రాజేశ్వరి, ఏజేఏసీ బిడ్డిక రామారావు, కె.అప్పలస్వామి, కిల్లక గణపతి, టీఆర్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఇంటికుప్పల రామకృష్ణ, తాడంగి లోకనాథం, మొండెంఖల్, నీలకంఠాపురం, జరడ, ఉరిడి సర్పంచ్‌లు గౌరీశంకరరావు, మన్మథరావు, తదితరులు పాల్గొన్నారు.